క్లుప్తంగా

వడియరాజుల సంఘ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలిగా మాధవి


యనమల మాధవి

సింగరాయకొండ: ఆంధ్రప్రదేశ్ వడియ రాజుల సంక్షేమ సంఘ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలిగా తాను నియమితులైనట్లు వైఎస్సార్ సీపీ కొండపి నియోజకవర్గ మహిళా విభాగం అధ్యక్షురాలు యనమల మాధవి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గత ప్రభుత్వంలో వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్‌గా పనిచేశానన్నారు. 30 సంవత్సరాలుగా వడియరాజుల సంక్షేమానికి కృషి చేసిన ఫలితంగా రాష్ట్ర పదవి వచ్చినట్లు ఆమె పేర్కొన్నారు. ఈ సందర్భంగా మండలంలోని వడియరాజులు మాధవికి శుభాకాంక్షలు తెలిపారు.

మీజిల్స్ రూబెల్లా వ్యాక్సిన్‌పై స్పెషల్ డ్రైవ్

సింగరాయకొండ: స్థానిక మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ఈ నెల 26వ తేదీ నుంచి మూడు విడతలుగా చిన్నారులకు మీజిల్స్ రూబెల్లా వ్యాక్సిన్‌పై స్పెషల్ డ్రైవ్ నిర్వహించనున్నట్లు ప్రభుత్వ వైద్యాధికారులు ధీరేందర్, చైతన్యకృష్ణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మీజిల్స్ రూబెల్లా వ్యాధి సోకిన చిన్నారులకు జ్వరంతో కూడిన నిమోనియా వ్యాధి సోకడంతో ఒంటిపై దద్దుర్లు వచ్చే ప్రమాదం ఉందని, ఈ వ్యాధితో పిల్లల్లో శారీరక ఎదుగుదల తగ్గుతుందని వివరించారు. ఈ నెల 26 నుంచి 31వ తేదీ వరకు, జూన్ 23వ తేదీ నుంచి 26వ తేదీ వరకు, జూలై 21వ తేదీ నుంచి 26వ తేదీ వరకు మూడు విడతలుగా స్పెషల్ డ్రైవ్ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. చిన్నారులకు తప్పనిసరిగా వ్యాక్సిన్ వేయించాలని సూచించారు.

తిరునాళ్లకు హాజరు కావాలని ఆహ్వానం

కనిగిరిరూరల్: హనుమాన్ జయంతి సందర్భంగా ఈ నెల 22న స్థానిక కొత్తూరు అభయాంజనేయ స్వామి తిరునాళ్ల మహోత్సవంలో పాల్గొనాలని పార్టీ నేతలు వైఎస్సార్ సీపీ కనిగిరి ఇన్‌చార్జి దద్దాల నారాయణ యాదవ్‌ను ఆహ్వానించారు. పార్టీ మండల అధ్యక్షుడు, జెడ్పీటీసీ మడతల కస్తూరిరెడ్డి, అంగన్‌వాడీ విభాగం రాష్ట్ర సెక్రటరీ తమ్మినేని సుజాతరెడ్డి, వైద్య విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు డాక్టర్ ఆవుల కృష్ణారెడ్డి, అచ్చాల శ్రీనివాసులరెడ్డి, ముల్లంగి శ్రీహరి రెడ్డి, మడతల వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

వరుసగా రెండో రోజు తగ్గిన కనిష్ట ధర

కొండపి: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో సోమవారం కనిష్ట ధర కేజీ రూ.203 పలకగా మంగళవారం నిర్వహించిన వేలంలో మరొక మూడు రూపాయలు తగ్గి రూ.200 పలికింది. పొగాకు ధరలు పెరిగితే తమ పరిస్థితి మెరుగు పడుతుందని రైతులు అనుకుంటుంటే ధరలేమో రోజురోజుకూ తగ్గుతున్నాయి. ధరలు తగ్గడంతో రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మంగళవారం నిర్వహించిన వేలంలో పొగాకు కనిష్ఠ ధర కేజీ రూ.200 పలికిందని వేలం నిర్వహణాధికారి జి.సునీల్‌కుమార్ తెలిపారు. క్లస్టర్ పరిధిలోని కామేపల్లి గ్రామానికి చెందిన రైతులు వేలానికి 740 బేళ్లను తీసుకొచ్చారు. అందులో 585 బేళ్లు కొనుగోలుయ్యాయి. వ్యాపారుల వివిధ కారణాలతో 155 బేళ్లను తిరస్కరించారు. పొగాకు గరిష్ఠ ధర కేజీ రూ.280, సరాసరి ధర కేజీ రూ. 254.62గా నమోదైంది. వేలంలో 17 కంపెనీలకు చెందిన వ్యాపార ప్రతినిధులు పాల్గొన్నారు.

11 మంది పరీక్షకు గైర్హాజరు

సింగరాయకొండ: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో మంగళవారం జరిగిన 10వ తరగతి సప్లిమెంటరీ పరీక్షల్లో భాగంగా హిందీ పరీక్షకు 16 మంది హాజరు కావాల్సి ఉండగా కేవలం ఐదుగురు మాత్రమే హాజరయ్యారు. 11 మంది గైర్హాజరైనట్లు పరీక్షల నిర్వహణాధికారి రామారావు తెలిపారు.

యోగాతో ఏకాగ్రత పెంపు


వేసవి శిక్షణ తరగతుల్లో యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు

సీఎస్‌పురం(పామూరు): యోగాతో విద్యార్థుల్లో ఏకాగ్రత, ఆరోగ్యం పెంపు సాధ్యమవుతుందని హెచ్‌ఎం ఎస్.వెంకటరామయ్య, గ్రంథపాలకుడు ఆళ్ల భాస్కరరావు అన్నారు. స్థానిక పాఠశాలలో మంగళవారం గ్రంథపాలకుడు ఆళ్ల భాస్కరరావు అధ్యక్షతన వేసవి శిక్షణ కార్యక్రమాల్లో భాగంగా యోగాపై శిక్షణ నిచ్చారు. అనంతరం విద్యార్థులతో నీతి కథలు చెప్పించడం, ప్రయోగాలు విధానం, ఆటలు ఆడించి, క్రీడల్లో మెళకువలు నేర్పించారు.



గతంలో కనిగిరి టు కలగట్ల రోడ్డు ఇలా (ఫైల్)

నాటి మంచి .. నేటి ఫలితం



ప్రస్తుతం కనిగిరి టు కలగట్ల రోడ్డు ఇలా..

- కనిగిరి, పీసీపల్లి మండలాల లింకు రోడ్డుకు మోక్షం
- రూ.11 కోట్లతో 12.02 కి.మీల రోడ్డు పూర్తి ఆనందంలో కనిగిరి టు కలగట్ల రోడ్డు వాసులు
- మాజీ సీఎం జగన్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్న ప్రజలు

కనిగిరిరూరల్:

దశాబ్దాల నుంచి ప్రజలు సరైన రోడ్లు లేక నానా ఇబ్బందులు పడ్డారు. ఎందరో వచ్చారు.. వాగ్దానాలు కూడా ఇచ్చారే కాని రోడ్డు వేసిన పాపాన పోలేదు. ప్రజల ఇబ్బందిని గమనించిన నాటి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అప్పట్లో నిధులు మంజూరు చేసి పనులు ప్రారంభించింది. దాని ఫలితంగా నేడు ప్రజలు హాయిగా ప్రయాణం చేస్తున్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మంజూరైనా, శంకుస్థాపనలు జరిగిన అనేక అభివృద్ధి పనులు అనేకం నేడు సత్ఫలితాలిస్తున్నాయి. అలాంటి అభివృద్ధి పనుల్లో ఒకటి ఇది. తాతల కాలం నాటి నుంచి మట్టి రోడ్డుగానే ఉన్న రెండు మండలాలకు కలిపిన లింకు రోడ్డు, పది గ్రామాలకు ఉపయోగ పడే ప్రధాన రోడ్డు అయినా కనిగిరి టు కలగట్ల రోడ్డు పూర్తయి వాహన రాకపోకలు సాగుతున్నాయి. ఈ రోడ్డుకు ఎండీఆర్ ప్లాన్ గ్రాంట్ మంజూరు చేస్తూ 2023 జులై 10న జీవో ఇచ్చారు. ఆతర్వాత వెంటనే (ఎన్నికలకు ముందు) అప్పటి ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్‌యాదవ్ శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించారు. పనులు శరవేగంగా జరిగిన ఎన్నికలు ముగిసిన తర్వాత రోడ్డు పనులు పూర్తిగా ముగిసాయి. ప్రస్తుతం ఈ రోడ్డులో రెండు మండలాలకు చెందిన ప్రజలు, కనిగిరి మండలంలోని సుమారు పది గ్రామాల వారు ఎంతో సంతోషంగా రాకపోకలు సాగిస్తున్నారు.

గతమంతా గోతులే..

నేతలెందరు మారినా ఈ రోడ్డు రాత మార లేదు. టీడీపీ, కాంగ్రెస్ పార్టీ నేతలు అనేక మంది అనేక మార్లు వాగ్దానాలు చేసినా ఈ రోడ్డును పూర్తి చేయలేదు. దీంతో ఈ రోడ్డులో ప్రయాణం ప్రజలకు నరక యాతన పడేవారు. వర్షం పడితే అడుగుతీసి అడుగు వేయలేని దుస్థితి. ఆటోలు సైతం ఆరోడ్డులోని గ్రామలకు వెళ్లని వైనం. అడుగడుగునా గోతుల మయంగా ఉండేది. అయితే గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఈ రోడ్డుకు మోక్షం కల్గింది. 12 కిమీల మట్టి రోడ్డును రూ.11 కోట్లు మంజూరు చేసి తారు రోడ్డుగా అభివృద్ధి చేశారు.

ఈ రోడ్డుతో ఉపయోగం ఇలా..

నియోజకవర్గంలోని కనిగిరి, పీసీపల్లి మండలాలకు కలగట్ల రూటు లింకు రోడ్డుగా ఉంది. కనిగిరికి 12 కిమీల దూరం వరకు కలగట్ల, రాచగుండ్లపాడు, నిమ్మ మహేశ్వరపురం, పొలవరం, కొత్తపల్లి, గ్రామాలున్నాయి. అదే రూట్‌లో వయా ముద్దపాడు, వాకంవారిపల్లి, మర్రికుంట పల్లి, పీసీపల్లికి 18 కి.మీల దూరంలో చేరవచ్చు. ఇదే మార్గంలో 2 కి.మీల దూరంలో వాగుపల్లి, మూడు కిమీల దూరంలో లింగారెడ్డిపల్లి చేరవచ్చు. కలగట్ల గ్రామం కనిగిరి, పీసీపల్లి మండలాలకు జంక్షన్‌గా ఉంటుంది. వాగుపల్లి మీదుగా వయా ఏరువారిపల్లి, చిన్న బట్టుపల్లి, బట్టుపల్లి, బుడ్డారెడ్డి పల్లి మీదుగా పీసీపల్లి చేరవచ్చు. ఈ రోడ్డు తారు రోడ్డుగా మారడం వలన ప్రస్తుతం రెండు మండలాలకు చెందిన ప్రజలు తక్కువ దూరంలో వాహనాలపై ఆటోల్లో త్వరగా నియోజకవర్గ, డివిజన్ కేంద్రమైన కనిగిరికి చేరుతున్నారు. అదే ప్రధాన రహదారి గుండా పీసీపల్లికి చేరాలంటే సుమారు 27 కిమీల దూరం ప్రయాణం చేయాల్సిన పరిస్థితి. ఈ రోడ్డుకు సంబంధించి పీసీపల్లి మండలం ముద్దపాడు పంచాయతి పరిధిలో మరో 3 కిలోమీటర్లు మాత్రమే మట్టి రోడ్డు ఉంది. ఆ కొంచెం రోడ్డు కూడా తారురోడ్డు అయితే ప్రయాణం మరింత సులభతరం అవుతుంది.

ఈ రహదారి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పుణ్యమే..



నా చిన్నప్పటి నుంచి మా కలగట్ల రోడ్డు మట్టి రోడ్డుగానే ఉంది. అనేక మార్లు పాలకులను అడిగాం. కానీ ఎవరూ పట్టించుకోలేదు. రోడ్లు అత్యంత అధ్వానంగా ఉండి గోతులమయంగా ఉండేవి. అత్యవసర సమయంలో ఆస్పత్రులకు వెళ్లాలంటే ఆటోలు కూడా వచ్చేవి కావు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో నిధులు మంజూరు చేసి పనులు ప్రారంభించారు. ఇటీవల పనులు పూర్తయ్యాయి. ఎంతో ఆనందంగా ఉంది.

– మునగల బ్రహ్మారెడ్డి, రాచగుండ్లపాడు

పార్టీ బలోపేతానికి సమష్టిగా పనిచేద్దాం

- వైఎస్సార్ సీపీ కనిగిరి ఇన్‌చార్జి దద్దాల నారాయణ


మాట్లాడుతున్న దద్దాల నారాయణ యాదవ్

హనుమంతునిపాడు: పార్టీ బలోపేతానికి కార్యకర్తలంతా సమష్టిగా కృషి చేయాలని వైఎస్సార్ సీపీ కనిగిరి ఇన్‌చార్జి దద్దాల నారాయణ యాదవ్ అన్నారు. మండలంలోని సీతారాంపురం పంచాయతీ రేషన్ డీలర్ తాతిరెడ్డి వెంకటేశ్వరరెడ్డిని కూటమి ప్రభుత్వం అక్రమంగా తొలగించింది. ఆయన 25 ఏళ్లుగా డీలర్‌గా ఉన్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం ఆయన్ను కలిసి మాట్లాడారు. కూటమి ప్రభుత్వ అరాచకాలను ప్రజలంతా గమనిస్తున్నారని, తగిన సమయంలో బుద్ధి చెబుతారన్నారు. పార్టీని గ్రామస్థాయి నుంచి బలోపేతం చేసేందుకు అందరం కృషి చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో ఇచ్చిన మాటకు కట్టుబడి సంక్షేమ పథకాలను పార్టీలకతీతంగా అమలు చేసిన ఘనత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. వైఎస్సార్ సీపీ హయాంలో సంక్షేమ పథకాలు అందని గడప అంటూ లేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఒక్క హామీని అమలు చేయలేదన్నారు. అబద్ధపు హామీలతో గద్దెనెక్కి అరాచకాలు, అడ్డగోలు అరెస్టులతో ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారన్నారు. అన్ని వర్గాలకు మేలు జరగాలంటే తిరిగి జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ గామం బలరామిరెడ్డి, కన్వీనర్ యక్కంటి శ్రీనివాసులరెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి గాండ్లపర్తి ఆదినారాయణెడ్డి, సర్పంచ్ సంఘ అధ్యక్షుడు ఎస్ మధుసూదన్‌రెడ్డి, రైతు సంఘ అధ్యక్షుడు శ్యామల సాంబిరెడ్డి, మారంరెడ్డి రవేంద్రరెడ్డి, మద్ది తిరుపతయ్య, కేతిబోయిన వెంకటకాశయ్య, సర్పంచ్ గాలం రామకృష్ణ, మోహన్‌రెడ్డి, రుద్రపాటి రాజు, కె.చంద్రశేఖర్, కందుల రమణారెడ్డి, మునలయ్య, కాటంరాజు, ఏరువ వెంకటరెడ్డి, టి.తిరుపతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలని నిరసన



మాట్లాడుతున్న పీసీ కేశవరావు



పామూరులో నిరసన తెలుపుతున్న సీఐటీయూ నాయకులు

కనిగిరిరూరల్: కార్మిక సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలోని ర్యాలీ నిర్వహించి, అనంతరం ఆర్డీఓ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా నాయకులు పీసీ కేశవరావు మాట్లాడుతూ లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలని, కార్మికులకు కనీస వేతనం అమలు చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, విశాఖ ఉక్కు కర్మగారాల్లో తొలగించిన 4వేల మంది కార్మికులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని, పని గంటలకు పెంచకుండా పని భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. మోడీ ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను తీవ్రంగా ఎండగట్టారు. సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు శేషయ్య, లక్ష్మయ్య, రమణమ్మ, వెంకటేశ్వర్లు, యు పిచ్చయ్య, ఎస్‌కే వలి, నెహమత్, ప్రసన్న, నరేంద్ర, శాంతకుమారి, రహిమాన్, వెంకటేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

పామూరు: లేబర్ కోడ్స్ రద్దయ్యే వరకు పోరాటాలు కొనసాగించేందుకు సిద్ధంగా ఉండాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కొమ్మలపాటి మాల్యాద్రి, ఏఐటీయూసీ నాయకులు సయ్యద్ మౌలాలి అన్నారు. లేబర్‌కోడ్స్ రద్దుతో పాటు, కార్మిక చట్టాల అమలు కోరుతూ మంగళవారం సీఐటీయూ, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో వేర్వేరుగా నిరసన కార్యక్రమాలు చేపట్టారు. సమాన పనికి సమాన వేతనం, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, కార్మికులకు సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పులు అమలు చేయాలన్నారు. ఏఐటీయూసీ నాయకులు పి.మస్తాన్‌రావు, వజ్రాల సుబ్బారావు, రైతుసంఘం నాయకులు రఘునాథరెడ్డి, రాగిపాటి సూరిబాబు, సీఐటీయూ నాయకులు కె.శంకర్, వైవీ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

టంగుటూరు: స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద కార్మిక సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా నాయకుడు వి.బాలకోటయ్య మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న మోదీ ప్రభుత్వం కార్మికులకు ఇబ్బంది కలిగించే విధంగా 4 లేబర్ కోడ్‌లు తేవటం దుర్మార్గమన్నారు. 39 లేబర్ కోడ్‌లను కుదించి నాలుగుగా మార్చటం అంటే మోదీ కార్పొరేట్‌లకు అనుకూలంగా, కార్మికులకు వ్యతిరేకంగా పని చేస్తున్నారని తెలిపారు. మోదీ ప్రభుత్వం వ్యవసాయ చట్టాల్లో కూడా సవరణలు చేసి రైతులకు నష్టం కలిగించే విధంగా చేయటం అన్యాయమన్నారు. సీఐటీయూ జిల్లా నాయకుడు రాము మాట్లాడుతూ టోల్ ప్లాజా కార్మికులు తమకు రావాల్సిన పెండింగ్ బిల్లులు ఇవ్వాలని, 34 రోజుల నుంచి నిరసన తెలుపుతున్నా యాజమాన్యం పట్టించుకోక పోవటం దుర్మార్గమన్నారు. టోల్ ప్లాజా కార్మికులకు న్యాయం చేయాలని తహసీల్దార్ ఆంజనేయులుకు ఆర్జీ అందించారు. తహసీల్దార్ మాట్లాడుతూ నేషనల్ హైవే అధికారులతో మాట్లాడి టోల్ ప్లాజా కార్మికుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని తెలిపారు. కేవీపీఎస్ నాయకులు వేసుపోగు మోజెస్, ఐఎఫ్‌టీయూ నాయకులు టి.వెంకటరావు, ఏఐటీయూసీ నాయకులు టి.ప్రభాకర్, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు టి.సుబ్బారావు, జి.అంకయ్య, కాశీ, తిరుమలరావు, వసంతలక్ష్మి,కోదండం, నరసింహం పాల్గొన్నారు.

ఫుడ్ సేఫ్టీ అధికారుల దాడులు

టంగుటూరు: పట్టణంలోని పలు కిరణా షాప్‌లపై ఫుడ్ సేఫ్టీ అధికారులు మంగళవారం దాడులు చేశారు. శివాలయం బజారులో శేషగిరి కిరణా షాప్‌పై ఫుడ్ సేఫ్టీ అధికారులు దాడులు చేసి ఎమ్మార్పీ కంటే అధిక ధరలకు విక్రయిస్తున్న వాటర్ బాటిళ్లను పరిశీలించారు. ఫుడ్ సేఫ్టీ అధికారి నరసింహం మాట్లాడుతూ వాటర్ బాటిల్స్ పేర్లు మార్చి ఎమ్మార్పీ కంటే ఎక్కువ ధరకు విక్రయిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డొల్ల కంపెనీల పేర్లతో వాటర్ బాటిల్స్‌లో మంచినీరు నింపి విక్రయాలు చేస్తే చర్యలు ఉంటాయని హెచ్చరించారు. అధికారుల దాడులతో వ్యాపారులు తమ చిల్లర దుకాణాలు మూసివేశారు.

మధుకు డాక్టరేట్ ప్రదానం


డాక్టరేట్ పొందిన మధు

జరుగుమల్లి (సింగరాయకొండ): జరుగుమల్లి మండలం చిర్రికూరపాడు గ్రామానికి చెందిన ఎం.మధుకు అనంతపురం జేఎన్‌టీయూ 14వ స్నాతకోత్సవంలో గౌరవ డాక్టరేట్ ప్రదానం చేశారు. రాజంపేట అన్నమాచార్య కళాశాలలో మధు ఫార్మసీ విభాగంలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నాడు. ప్రొఫెసర్ ఎస్‌వీ సత్యన్నారాయణ, డాక్టర్ కె. శరవణకుమార్ ఆధ్వర్యంలో ఫార్మాస్యూటికల్ సైన్స్ విభాగంలో డెవలప్‌మెంట్ అండ్ వాలిడేషన్ ఆఫ్ యూపీఎల్సీ మెథడ్స్ ఫర్ క్వాంటిటేటివ్ ఎస్టిమేషన్ ఆఫ్ సెలెక్టెడ్ డ్రగ్స్ ఇన్ బల్క్ అండ్ డోసేజ్ ఫార్మ్స్ అనే అంశంపై పరిశోధన చేసి డాక్టరేట్ సాధించినట్లు తెలిపారు. ఈ పరిశోధన ఔషధ పరిశ్రమలో నాణ్యత నియంత్రణ పరీక్షల్లో విశేషంగా ఉపయోగపడుతుందన్నారు. డాక్టరేట్ పొందిన మధును చాన్సలర్ చొప్పా గంగిరెడ్డి, సి.అభిషేక్, వైస్ చాన్సలర్ సాయిబాబారెడ్డి, ప్రిన్సిపాల్ డి.స్వర్ణలత, ఆంధ్రాస్కూల్ అధినేత బొమ్మల శ్రీనివాసరావు, కుటుంబ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

జూదరుల అరెస్టు

టంగుటూరు: మండలంలోని సూరారెడ్డిపాలెం లారీ ఆఫీస్ సమీపంలో పేకాట శిబిరంపై ఎస్సై నాగమల్లేశ్వరరావు మంగళవారం తన సిబ్బందితో దాడి చేశారు. దాడిలో 9 మంది జూదరులను అదుపులోకి తీసుకొని వారి నుంచి రూ.7250 నగదు, సెల్‌ఫోన్లు, ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకొని సీజ్ చేశారు. జూదరులపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరచనున్నట్లు ఎస్సై నాగమల్లేశ్వరరావు తెలిపారు.

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిసిన బన్నీ



కనిగిరిరూరల్: వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని పీడీసీసీ బ్యాంకు మాజీ చైర్మన్ వైఎం ప్రసాద్‌రెడ్డి(బన్నీ) మంగళవారం కలిశారు. తాడేపల్లి క్యాంప్ కార్యాలయంలో జగన్‌మోహన్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి మాట్లాడారు.

కౌలు రైతులకు బీమా పథకం అమలు చేయాలి


మాట్లాడుతున్న కేజీ మస్తాన్

కొండపి: కౌలు రైతులకు బీమా పథకం అమలు చేసి బ్యాంకుల ద్వారా లోన్ ఇవ్వాలని, భూమికి సంబంధించిన నష్టపరిహారం వారికి చెందే విధంగా చర్యలు తీసుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘ రాష్ట్ర నాయకుడు కేజీ మస్తాన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం, కౌలు రైతు సంఘాల ఆధ్వర్యంలో కొండపిలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కేజీ మస్తాన్ మాట్లాడుతూ వ్యవసాయ కార్మిక సంఘాలు, వామపక్ష పార్టీలు అనేక సంవత్సరాలుగా కూడైనా పెట్టండి.. లేదా పనైనా చూపెట్టండి అనే నినాదంతో అనేక పోరాటాల ఫలితమే ఉపాధి హామీ చట్టం సాధించినట్లు పేర్కొన్నారు. ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసే కుట్ర జరుగుతోందని, దాన్ని తిప్పి కొట్టాల్సిన అవసరం అందరిపై ఉందని పిలుపునిచ్చారు. ఉపాధి కూలీలకు రోజుకు 600 వేతనం ఇవ్వాలని, 200 రోజుల పని దినాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కౌలు రైతు సంఘ జిల్లా నాయకుడు ఎం.పేతురు, రైతు సంఘ నాయకులు జయరావు, సీఐటీయూ నాయకుడు గడ్డం వందనం, వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు శామ్యూల్, లక్కపోగు కోటయ్య, కొండమ్మ, నరసింహ, యాకోబు, సింగారెడ్డి, కొండారెడ్డి పాల్గొన్నారు.

చిరస్మరణీయుడు ప్రకాశం పంతులు


ప్రకాశం పంతులు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న చైర్మన్ గఫార్

కనిగిరిరూరల్: స్వాతంత్ర్య సమరయోధుడు, ఆంధ్ర రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు చిరస్మరణీయుడని మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో టంగుటూరి ప్రకాశం పంతులు 69వ వర్ధంతిని నిర్వహించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో చైర్మన్ గఫార్ మాట్లాడుతూ ప్రజా సేవకే తన జీవితాన్ని అంకితం చేసిన టంగుటూరి ప్రకాశం పంతులు చిరస్మరణీయుడన్నారు. ముఖ్యమంత్రిగా ఎన్నో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టారని కొనియడారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు ప్రదీప్, కోటేశ్వరరావు, కె.రఘు, నాయబ్ రసూల్, చెన్న కేశవులు, కోఆప్షన్ సభ్యులు చింతం శ్రీను, మున్సిపల్, మెప్మా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కూలీల సమస్యలు పరిష్కరించాలి


ఉపాధి పనుల వద్ద హర్తాల్ నిర్వహిస్తున్న ఉపాధి కూలీలు


తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న నేతలు

హనుమంతునిపాడు: గ్రామీణ ఉపాధి హామీ కూలీల సమస్యలు పరిష్కరించాలని నందనవనం పంచాయతీలోని కూలీలు మంగళవారం వ్యవసాయ కార్మిక సంఘ ఆధ్వర్యంలో హర్తాల్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ కార్మిక సంఘ ఉపాధ్యక్షుడు బడుగు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ జాబ్ కార్డునున్న ప్రతి కూలీకి పని లేదనకుండా పని కల్పించాలన్నారు. కూలీలకు పని చేసిన 7 వారాల బిల్లు వెంటనే విడుదల చేయాలన్నారు. జాబ్‌కార్డుదారులకు 200 రోజులకు పని తగ్గకుండా పని కల్పించాలన్నారు. కూలీలందరికీ ప్రభుత్వమే ఉచిత బీమా సౌకర్యం కల్పించాలన్నారు. కూలీలకు మజ్జిగ ప్యాకెట్లు, తాగునీటి వసతి కల్పించాలని కోరారు. మండల వ్యవసాయ కార్మిక సంఘ నాయకులు, ఉపాధి కూలీలు మేట్లు పాల్గొన్నారు.

200 రోజుల పనిదినాలు కల్పించాలి

సీఎస్‌పురం(పామూరు): ఉపాధి హామీ కూలీలకు ఏడాదికి 200 రోజుల పనిదినాలు కల్పించాలని వ్యవసాయ, రైతుకార్మికసంఘ నాయకుడు ఊసా వెంకటేశ్వర్లు అన్నారు. ఈ మేరకు ఉపాధి కూలీలతో కలిసి ఉప్పలపాడు, నల్లమడుగుల, అరివేముల సచివాలయాల్లో పంచాయతీ కార్యదర్శులకు, తహసీల్దార్ పొన్నరుసు వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందజేశారు. పనిప్రదేశంలో ప్రమాదంజరిగి మరణిస్తే వారికి రు.5 లక్షల పరిహారం ఇప్పించాలన్నారు.

విద్యతోనే లింగవివక్ష దూరం


అవగాహన చేస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పార్వతి

పామూరు: విద్యతోనే లింగవివక్షను రూపుమాపవచ్చని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎంవిఎస్.పార్వతి అన్నారు. మండలంలోని మోట్రావులపాడు అంగన్‌వాడీ కేంద్రంలోమంగళవారం కిశోరవికాసం కార్యక్రమంలో భాగంగా ఆడపిల్లలపట్ల లింగవివక్ష, అసమానతలు అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బాల్యవివాహాలను, లింగవివక్షను నిర్మూలించాలని కోరుతూ అవగాహన ర్యాలీ, ప్రతిజ్ఞ చేయించారు. ఫెసిలిటేటర్ ఎంఎస్‌కే షేక్.అబీద, ఏఎన్‌ఎం అన్నమ్మ, ఎస్.ప్రమీల, కె.సుబ్బలక్ష్మి, రత్తమ్మ, కిశోర బాలికలు పాల్గొన్నారు.

కనిగిరిరూరల్: బంగారు బాల్యం, కిశోరి వికాసం కార్యక్రమంలో భాగంగా మంగళవారం చింతలపాలెం ఎస్సీ కాలనీలో ప్రాథమిక పాఠశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ పి.సరోజని కిశోర బాలికలకు లింగ వివక్షపై అవగాహన కల్పించారు. ఐడీసీఎస్ సూపర్‌వైజర్లు, సిబ్బంది, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

సరితారెడ్డిని పరామర్శించిన నేతలు


వైఎం సరితారెడ్డిని పరామర్శిస్తున్న నేతలు

కనిగిరిరూరల్: అనారోగ్యంతో ఇటీవల చికిత్స పొంది ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్న పీడీసీసీబీ మాజీ చైర్మన్ వైఎం ప్రసాద్‌రెడ్డి సతీమణి, ఏఎంసీ మాజీ చైర్మన్ వైఎం సరితారెడ్డిని జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, పార్టీ కనిగిరి ఇన్‌చార్జి దద్దాల నారాయణ యాదవ్, పార్టీ నేతలు మంగళవారం పరామర్శించారు. వైఎం సరితారెడ్డి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్, జెడ్పీటీసీలు మడతల కస్తూరిరెడ్డి, లక్ష్మీ కాంతంరెడ్డి, పార్టీ మండల అధ్యక్షులు యక్కంటి శ్రీనివాసులరెడ్డి, జీ బొర్రారెడ్డి, పార్టీ అంగన్‌వాడీ విభాగం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని సుజాతరెడ్డి, కౌన్సిలర్లు, ఇతర నేతలు పాల్గొన్నారు.